క్లుప్తంగా

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బాలికలతో పీఈటీ వీరస్వామి

మఠంపల్లి : హుజూర్‌నగర్‌లో ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి పాఠశాలల వాలీబాల్ క్రీడా పోటీల్లో మండలంలోని వరదాపురంలో గల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.అనూష అండర్‌- 14 విభాగంలో, అండర్‌-17 విభాగంలో ఎస్. హర్షిత, ఎమ్. అనూష, ఎస్. ధరణి, ఎన్. మల్లీశ్వరీలు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సోమవారం పీఈటీ మామిడి వీరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీలో చేరిన న్యాయవాది చంద్రయ్య



రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రాంచందర్ రావు, శ్రీలతతో న్యాయవాది చంద్రయ్య

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన న్యాయవాది పిడమర్తి చంద్రయ్య సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాషాయం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని గోవిందపురంలో శ్మశాన వాటికకు వెళ్లే దారి ఆక్రమించి రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోవిందపురంకు చెందిన పలువురు కోరారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, పెద్దలు ఉండేటి రాజా, బొల్లెదు ధనమ్మ, పాశం కోటమ్మ, దేవిశెట్టి వేణు, పి.నరసింహారావు, ధనుంజయ, రాములు, నరేష్, పుల్లయ్య, పార్థు, వీరబాబు, రవి, నాగయ్య, గోపి, వెంకట్, అరుణ్ పాల్గొన్నారు.

ఉచిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : సంకట హరణ బీమా పథకం కింద ఇఫ్‌కో కంపెనీ నానో ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు కల్పిస్తున్న ఉచిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, ఇఫ్‌కో ఉమ్మడి జిల్లా మేనేజర్ వెంకటేష్ అన్నారు. ఇఫ్‌కో ఎరువులను కొనుగోలు చేసి ఇటీవల మృతి చెందిన నలజాల కోదండరావుకు మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును సోమవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీఈఓ మౌలాని, డైరెక్టర్లు అన్నెం రవీందర్‌రెడ్డి, శ్రీను, గుగులోతు రవి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఎస్‌టీయూ కమిటీ ఎన్నిక



నరసింహారావు, అధ్యక్షుడు



నాగరాజు, ప్రధాన కార్యదర్శి

గరిడేపల్లి : మండల కేంద్రంలో సోమవారం ఎస్‌టీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీసాల నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా గొర్రె నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా గుండు సతీష్, మరికొందరిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఆర్. శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ సత్యనారాయణ తెలిపారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఎస్ఐ మోహన్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని యాతవాకిళ్లకు చెందిన జక్కుల గురవయ్య -సంధ్యారాణిల కుమారుడు యాక్షిత్‌నాథ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని జిప్స్ అనాథ పిల్లల ఆశ్రమంలో పిల్లలకు టిఫిన్ ప్లేట్లు, వాటర్ బాటిల్స్, అల్పాహారం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

24న వైద్యశిబిరం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఈనెల 24వ తేదీన ఉప్పలేవి సెంటినరీ బాప్టిస్ట్ మెడికల్ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు ఆర్.నతానియల్, కార్యదర్శి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె, చిన్న పిల్ల ల డాక్టర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈసీజీ, టుడి ఈకో, బీపీ, బ్లడ్ షుగర్ తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. దుర్గామాత అమ్మవారి విగ్రహాలను డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గమ్మ ఆలయాల్లోనూ భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



గరిడేపల్లి : కీతవారిగూడెంలో పూజలు చేస్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : అమ్మవారి ఊరేగింపులో కోలాటం వేస్తున్న మహిళలు



చిలుకూరు : రామాలయం వద్ద..



నేరేడుచర్ల : విజయదుర్గ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



మునగాల : ప్రతిష్ఠించేందుకు అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా మండపానికి తీసుకువస్తున్న భక్తులు



నేరేడుచర్ల : విజయదుర్గ ఆలయంలో ధ్వజారోహణం చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రవీందర్

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



క్షేత్ర సందర్శనలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీధర్

నేరేడుచర్ల : పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించొచ్చని కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త వి.శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి లో ఆకు మచ్చ తెగులు నివారణకు సాఫ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో, సుడిదోమ ప్రారంభ దశలో నివారణకు పైమెట్రో జాయిన్ 0.6 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి వరి దుబ్బ చేసే దశలో మాత్రమే వరికి పిచికారీ చేయాలన్నారు. పోషకాల లోపం లేకుండా న్యూట్రీషన్‌ను పి చికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జావిద్, అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

దళితుల భూమి కాపాడాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, బాధితురాలు

నడిగూడెం : దళితుల భూములను అన్యాక్రాంతం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇంచార్జి మేరిగ సైదబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామానికి చెందిన నెమ్మాది జ్యోతి గత 40 ఏళ్లుగా వారసత్వంగా వచ్చిన 190 సర్వే నంబర్‌లో గల రెండు ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుందన్నారు. పలువురు ఆక్రమణదారులు రెవెన్యూ అధికారుల సాయంతో ఆ భూమని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బాధితురాలు జ్యోతికి న్యాయం చేయాలని తహసీల్దార్ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా నాయకుడు సైదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీల జేఏసీ జిల్లా కన్వీనర్ విజయరామరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి



మైహోం సిమెంట్ పరిశ్రమలో మొక్క నాటుతున్న జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సీతారాం

మేళ్లచెరువు : జిల్లాలోని పరిశ్రమలు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీతారాం సూచించారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్ సింగ్, జీఎం శ్రీరామ్, పర్యావరణ విభాగం సీనియర్ మేనేజర్ నాగరాజు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఐ శివశంకర్‌కు సన్మానం



సీఐని అభినందిస్తున్న ఏర్నేని బాబు తదితరులు

కోదాడరూరల్ : నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇటీవల ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందుకున్న కోదాడ పట్టణ సీఐ శివశంకర్‌ను మాజీ సర్పంచ్ ఏర్నేని బాబు ఆధ్వర్యంలో శాలవాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రావెళ్ల కృష్ణారావు, ఖాజా, మైలారిశెట్టి బాస్కర్, వేలాద్రి, దేవమని, వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కోల శ్రీనివాస్, కోల సాయికుమార్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పట్టణంలోని మంత్రి ఉత్తమ్ కార్యాలయం వద్ద టీపీసీసీ జాయింట్ సెక్రటరీ అజీజ్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరాజు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జె.మల్లయ్య, కె.మట్టయ్య, ఎస్.సైదులు, బి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మక్క మృతి తీరని లోటు

గరిడేపల్లి : ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ జిల్లా మాజీ అధ్యక్షురాలు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు లక్ష్మక్క అకాల మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రంగాపురంలో లక్ష్మక్క అంత్యక్రియల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్ష్మక్క తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పనిచేశారని ఆయన అన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల రాజేశ్వరి, కంచర్ల నర్సక్క, పోటు లక్ష్మయ్య, గంట నాగయ్య, కామళ్ల నవీన్, దుర్గారావు, వెంకటేశ్వరరావు, ఉదయగిరి, ఉమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా దుదియాతండా రోడ్డు



గుంతలమయంగా చిలుకూరు - దూదియాతండా రోడ్డు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రం నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బీటీ ధ్వంసమై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. చిలుకూరు నుంచి దూదియాతండా మీదుగా కోదాడ మండలం గుడిబండకు వెళ్లేందుకు ఇదొక్కటే దారి. అంతేకాకుండా ఈ రోడ్డు వెంట చిలుకూరు, దూదియాతండా గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. దీంతో రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దూదియాతండా నుంచి విద్యార్థులు వచ్చివెళ్తుంటారు. అంతేకాకుండా ఈ రోడ్డులో చిలుకూరు గ్రామ శివారులో ఒక గోదాం, రెండు వైన్స్‌లు ఉండడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కోదాడ నియోజకవర్గంలో రెండు మండలాలను కలిపే ఈ రోడ్డును తక్షణమే డబుల్ రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గంజాయి రహిత సమాజం కోసం బైక్ యాత్ర



మోతెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మోతె : డ్రగ్స్, గంజాయి రహిత సమాజం కోసం మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ నిర్వహిస్తున్న జన చైతన్య బైక్ యాత్ర సోమవారం మోతె మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన గంజాయి, డ్రగ్స్‌తో కలిసి అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పోరాడాలని ఆయన కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలో అర్చకులు, భక్తులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం గోపూజ చేశారు. దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలోనే చికిత్స.. కొలుకుంటున్న ఆవు



కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో 90 కిలోలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు తిని అస్వస్థకు గురైన ఆవు శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటోంది. మూడు రోజుల కిందట కడుపులో నుంచి 90 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీసిన ఆవును కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలోనే ఉంచి చికిత్స అందజేస్తున్నట్లు డాక్టర్ పెంటయ్య తెలిపారు. ప్రస్తుతం ఆవు ఆరోగ్యంగా ఉండి మేత మేస్తోందని తెలిపారు. పట్టణంలో ఇలాంటి ఆవులు పదుల సంఖ్యలో ఉన్నాయని వాటి యజమానులు పశువైద్యశాలకు తీసుకొస్తే పరీక్షించి వాటికి కూడా శస్త్రచికిత్స చేసి కాపాడుతామని డాక్టర్ తెలిపారు.

కోడిపిల్లకు శస్త్రచికిత్స

కోదాడరూరల్ : కుక్కల దాడిలో గాయపడిన కోడి పిల్లకు శస్త్రచికిత్స చేసి దాని ప్రాణాలు కాపాడారు కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య. వివరాలు.. కోదాడ పట్టణానికి చెందిన జి.రవికుమార్ ఆదాయం కోసం కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లు మేత కోసం బయటకు వచ్చిన సమయంలో ఓ కోడి పిల్లపై కుక్క దాడి చేసి మెడను గాయపరిచింది. ఆ కోడి పిల్లను యజమాని పశువైద్యశాలకు తీసుకరాగా పరీక్షించిన డాక్టర్ పెంటయ్య మెడ (బొరిగె) భాగంలో మేత నిల్వ ఉండకుండా కారిపోతున్నట్లు గుర్తించాడు. గాయమైన భాగంలో కుట్లు వేసి యాధాస్థితికి తీసుకొచ్చి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశాడు. శస్త్రచికిత్సలో చంద్రకళ, అఖిల్ ఉన్నారు.

ఎత్తిపోతలతో 45 వేల ఎకరాలకు నీరు

• మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

మోతె : రూ. 244 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పాలేరు ఎత్తిపోతల పథకం ద్వారా మోతె మండలంలో 45 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని భల్లు తండాలో అధికారులతో కలిసి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకంతో ఎస్సారెస్పీ ఎల్- 36, ఎల్-22 కెనాల్స్ ద్వారా మోతె మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందేలా మ్యాప్ డిజైన్ చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ యాదగిరి, డీఈలు రమేష్, సుస్మిత, జేఈలు సురేష్, సుస్మిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు మైనంపాటి గుర్వారెడ్డి, పుల్లారావు, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంచడం హర్షణీయం



యరగాని నాగన్నగౌడ్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

హుజూర్‌నగర్ : ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కార్మికులకు యాక్సిడెంటల్ ఎక్స్‌గ్రేషియాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని 25 లక్షల మంది బిల్డింగ్, తదితర కన్స్ట్రక్షన్ బోర్డులో నమోదైన కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం నల్లగొండ జిల్లాలోని కుక్కడం పరిధిలో గల విశాఖ వి బోర్డు కంపెనీలో జరిగిన గుర్తింపు ఎన్నికల్లో విజయం పొందిన కార్మికులు ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడైన నాగన్నను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, బ్లాక్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముక్కంటి, యూనియన్ నాయకులు జానయ్య, రాము, కె.వెంకన్న, వీరయ్య, నూకపంగు నాగయ్య, సోమ వెంకన్న, పోలగాని శ్రీనివాస్, కందుల శ్రీను, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, విక్రమ్, అఫ్జల్, సంజీవరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయించాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవన నిర్మాణ పనుల బిల్లులను విడుదల చేయించాలని కోదాడ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కోరారు. ఈమేరకు ఆదివారం రాత్రి కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. పనులకు బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశాడని మంత్రికి వివరించారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి పనులకు సంబంధించి అన్ని వివరాలు తీసుకొని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్కను కలవాలని వారికి సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, న్యాయవాదులు గాలి శ్రీనివాస్‌నాయుడు, కృష్ణయ్య, శరత్‌బాబు, సుధాకర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మునగాల : రేపాల పీహెచ్‌సీలో రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్



నడిగూడెం పల్లె దవాఖానాలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి హరినాథ్

మునగాల : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్ కోరారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రేపాల పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో స్త్రీవైద్య నిపుణురాలు డాక్టర్ శ్రావణి 2మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం పీహెచ్‌సీకి మానసిక వైద్య నిపుణులు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి.భాస్కర్‌రాజు, హెల్త్ సూపర్‌వైజర్ బి.జయమ్మ, నర్సింగ్ అధికారి సునీత, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఫార్మసిస్టు శాంతయ్య, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీంద్ర, ఏఎన్‌ఎం పద్మ, ఆశాలు జ్యోతి, రమణ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

నడిగూడెం : మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ అన్నారు. సోమవారం పల్లె దవాఖానాలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబికంలో 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి చంద్రశేఖర్‌రాజు, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎంలు సుజాత, రాధ, ఆశా కార్యకర్తలు శ్రీలక్ష్మి, సునీత, సైదమ్మ, పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా'



రోడ్డు వెంట శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూర్‌నగర్ : పట్టణంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస థియేటర్ వద్ద నుంచి ప్రియదర్శిని జూనియర్ కాలేజ్ వరకు రోడ్డు పక్కన చెత్తను, పిచ్చి మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, సానిటరీ జవాన్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సీతారాములు, చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నాయకుల ముందస్తు అరెస్ట్

హుజూర్‌నగర్ : కోయ గోండు నాయకులు సోయం బాపురావు, తెల్లం వెంకట్రావుల ఇళ్ల ముట్టడికి వెళ్లకుండా గిరిజన హక్కుల పోరాట సమితి నాయకులను హుజూర్‌నగర్ పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో నాయకులు నగేష్ రాథోడ్, వెంకటేశ్వర్లు, నాగు, రాజు తదితరులు ఉన్నారు.

26న లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ

మఠంపల్లి : లంబాడీల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఈనెల 26న హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించ తలపెట్టిన లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేయాలని మఠంపల్లి మండల లంబాడా జేఏసీ నాయకులు శంకర్ నాయక్, భజన్‌నాయక్ కోరారు. సోమవారం మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొండానాయక్, మట్టపల్లినాయక్, హనుమంతునాయక్, నాగునాయక్, బాలునాయక్, నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి

మునగాల : కోదాడ పట్టణంలో మంగళవారం నిర్వహించబోయే భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కోల ఆంజనేయులు కోరారు. సోమవారం మండలంలోని తాడువాయి, నేలమర్రి గ్రామాల్లో మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సమస్యలపై నిర్వహించిన సర్వేలో ఆయన మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డులో లేబర్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు అల్లి నాగరాజు, సభ్యులు భుక్యా నాగరాజు, బాలా ఉపేందర్, సోమయ్య, కుడుముల వెంకటేశ్వర్లు, ఆకుల శంకర్, సురేష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లాలోని లేబర్ కార్యాలయాల ఎదుట నిర్వహించబోయే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

చిలుకూరు : మండలంలోని బేతవోలు, కొండాపురం గ్రామాల్లో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తదితర అభివృద్ధి పనులపై పల్లెల లక్ష్మణ్ కళాబృందం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు సత్యనారాయణ, కార్తీక్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

నేరేడుచర్ల : అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. పేదలు ప్రభుత్వ మాయ మాటలు నమ్మి ఉన్న ఇంటిని కూల్చి వేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.